
# మురారి

ఈ త్యాప మళ్లో సాదు వొచ్చిండు. మణిసి పోతవోసిన విగ్రం ఉన్నట్లు ఉన్నడు. తాకి ముగ్గిన వయిసూ గాదు. కండ్లల్ల ఇంగా కోదెమకురు పోనే లేదు. వొంటి మీద అంగి గూడ లేదు. కాషాయపు గుడ్డనే మెడదాంక జుట్టి ఆరకంట్లం గట్టిండు. కాళ్ళకు పాకోళ్ళున్నవి. కొనాలకు వొంకర్లు దిరిగిన మీసపుకట్టు నిగ నిగ మని మెరిసే సల్లటి గడ్డం రొండు గళ్ళుకపోయినవి. నెత్తేమొ నల్లగ నల్లగొంగడి కొప్పెర బెట్టినట్లుండది. మొగతనమంత కరిగిచ్చి పోతపోసినట్లుండదు. ఆ ముక్కన్న తీరు చెప్పేటట్లే లేదు. సామనఱుపు మొకంమీద ముక్కు కోటాకు వెట్టినట్లు గండ్లపడ్తుంటె "ధర్మరాజు కాలాన గొంతెమ్మ నడిపి కొడుక్కు అర్జునుడు సుభద్రమ్మ తల్లికోసం ఏశం గట్టి వొచ్చినట్లు గండ్ల వస్తది. ఆ మొకాన ఏం వచ్చిన్న ఉండదంటె చెప్పతరం గాదు." అని ఆ దిక్కు వెల్లి వొచ్చిన సిన్నాపెద్ద అంత జెప్పుకోవట్టిను. ఈ మాట లింటున్న రామచెంద్రయ్యకు పైముల్లేసింది. తండ్రి దగ్గెరికి బిర బిర వోయి నాయినా ! ఇంటున్నరా ఈ మాట, ఈసారి ఈయ నెవరో మహానుభావుడే ఉంటడు. వాళ్ళకు భిక్ష ఏర్పాటు జేతమా ? అని అడ్గిండు. సదువుతున్న భాగవతం పక్కకు వెట్టి కొడుక్కు దిక్కు సూసుకుంట ఆఁ బిక్ష ఒక్కటే ఎందుకురా నా తండ్రి పక్క గూడ ఏర్పాటు జెయ్యి. నీ వెన్నడో



86A

బైరాగులల్లగల్సి, జోలె బుడ్డి సెంబు సేతుల వట్టుకొని జైపరమేశ్వరా అంట పొయ్యేటట్లే ఉండవు. ఇంతకు నిన్నని ఫలమేంది? పుట్టెన పుట్టిన బుద్ధి పుల్లెలేసినా వోదంట. అది గాకుండ సచ్చి సర్గాన ఉన్న మీయమ్మ దాని గుణమంత పాలతోటి రంగరిచ్చి పోసింది రా. అది ఉన్ననాళ్లు దానాలు, ధర్మాలు, ప్యాదా సాద అనే సింత గని మరోటి లేక పాయె. నే సద్దం వొచ్చినప్పుడల్లా గీ యింతల్ని మన లచ్చిం బోదు ఊకోంది. లేనోడు లేకేడిస్తే ఉన్నోడు కడుపు గట్టి కలీ గంజి దాగి. ఎంగిలి సేత కాకిని గొట్టకుండ బతికితె లేకిడికీ నీకు బేదం ఏందీ? అంట. నాకు దెల్వక అడ్గుత గని, నిజంగ జెప్పుండి, లెక్క బొక్కలిగ్గ కష్టంజేసి. సిత్రగుప్తునోలె లెక్కరాస్తె నే దుడ్డు గూడి మద్దెలు గట్తరా? తన పొట్ట నిండినంక తోటోని మంచి సెబ్రి అర్సుకో కుంటె ఆ మిద్దెలు నిలవడ్తవా? ఈ యాళ్ళ అవి నిల్పి ఏంసాత్రకం ఈ ఇల్లు నిలవడ్డ దంటె, నల్గురిచ్చిన దీవెనాస్తె" అని అంబాళగౌరి పల్కినట్లు వక్కతుండె. అమ్మ కంటే ఆరాకులు ఎక్కువనె సదివితివి. నిజంగజెప్పరా! రామచెంద్ర నీ కే మన్న మతీ సుతి ఉండదా అంట. అని అడ్గిండు.

"ఈ బూమ్మీద సాదులు సన్నాసులు సంసారం రోసినోళ్లు లే రని గాదు. ఉన్నరు గని యా నూటికో కోటికో. అసుంటోళ్ళను ఇడ్సి' కండ్లవడ్డ గోసిగొంగడి గాళ్ళం దర్ని కండ్లకద్దుకుంట నంటె ఎట్ల జెప్పు? తాకినప్పు డల్ల కొత్త తట్టేనా? నా గ్గేండ్ల నాడు మన గుట్టరాళ్ళల్ల దిగంబర సన్నాసి గా డెవడో దిర్గుతుంటె వాణికి సాష్టాంగపడి సమారాదనజేసి ఊళ్లెకు దెస్తివి. ఇంగ వాడు బట్టగట్టి ఊ రెన్క సెంద్రమ్మకు సీకటిమడి నేర్పె నిరుడు గాక మో యేడు మళ్లో పైరాగి బచ్చున్న కల్లంగుట్ట

సొర్కెల వొచ్చి కూసుంటె వీ డెవరో పరుసవేది గుట్టు జిక్కిచ్చుకున్న వేమన్న సొంటి వేదాంతి అని ఊళ్ళకు దోల్దొచ్చి ఊరినడుమ గుడ సేపిచ్చి కొలుస్తె వా డేమొ కసరు గా యల్తోటి పసుర్లు గక్కిచ్చె. అప్పుడే అయిందా రా? బైరాగి బారతం. నిరుడేమొ ఏక్తారు హరిదాసుగాడు కీర్తన్లు వాడుకుంట బాయి గట్ల పొంటి దిర్గుతుంటె వాడో పెద్ద భజనపరుడని ఊరంత వోయి ఉల్లెడపట్తిరి. ఇంగ ఆ ఏక్తారు గాడేమొ ఊరి మీదపడి దొర్కిన బుర్కను గా దసక పాయె. నిన్న గాక మొన్న పందికొక్కు ల్యాక ఎవ్వరు గాని కుండ రాత్రో రాత్రి ఊళ్ళకు వచ్చి గొంతుల జీవి ఉండంగనె, గొంతు మట్టం గుంతల గూసోని పాతపడ్డ పాడు రోగాలన్ని ఈబూతి పెట్టి నయం జేస్త నని బూడ్ది పెట్టుకుంట, పత్తెం గిత్తెం అడ్గినోళ్ళకు తేలు, పాము, జెఱ్ఱి. బల్లి దప్ప బూ ప్రపంచంల పుట్టిన అన్ని పదార్థాలు సేవించుండి అని జెప్పి; వాడేమొ ఊరవుతలి సిన్న బట్టి సారసిద్దెలను సిద్దె అసొంటి కజ్జిని ఘట స్వా జేసె. ఇగ ఇప్పు డేమొ నీవు సెప్పె తీరు వట్టి చూస్తె ఆ వొచ్చిన మానుభావుడు సిన్న సన్నోడు ఉత్తుత్తోడని అనిపిస్త లేడు. ఇగ యీకోడెగాణ్ణి విల్సుకొచ్చి ఊళ్ళ విడిది ఏర్పాటు జేయి, వాడేమొ గుజ్జం బోత పోత గూటం పీకక్కపాయె నని మనసు పునాదుల్తోటి పెకిలిచ్చుక పోతడు. అని అంటుండంగనె ఆ సాదొచ్చి ఇంటి ముంగల నిలపడ్డడు, వచ్చిన సాదును తండ్రీ కొడుకు లిద్దరు రెప్ప ఏయకుండ జూసి అనుకోకుండ 'స్వాములు అరుగు మీదికి రావాలె' అని ఇద్దరు ఒక్కసారె అన్నరు. అరుగెక్కిండు సాదు.

సాదు సౌదరపల్లె ల పురపడ్డడు. ఎవరీ సాదు? ఏమొ ఎవరికెర్క? ఎవరైతె ఏంది? గని గొల్లపల్లెల గొల్లోళ్ళకు గోపాల

కృష్ణయ్య దొర్కి నట్లు దొరికిండు. అయితె ఆ నాడు గోపాలకృష్ణయ్యకు గోపెమ్మల తోటి పని గని ఈ సాదుకు మట్టు ఆ పొడ అంటెనె గిట్టదు. ఆపతిల ఉన్నోడు. కో అంటె ఓ అంటడు సాదు. ఆ ఊళ్ళ ఆయన పిలుస్తె పలకని మనిషి అంట లేడు. ఆయినను పిలుస్తె తొక్కని కడ్ప అంట లేదు సాదు అందరి మనిషి. అంద సాదు తననునోళ్ళే. మాల గూడెంల సా దంటె వాళ్ళ మాతమ్మ దేవుత. మాల గూడానికి మంచి నీళ్ళ బాయిలేదు. ఊరవుతలి ఊర బాయిని ముట్టగూడదు. ఊళ్లె ఉన్న. సేదుర బాయికాడ్కి పొయ్యేటట్లే లేదు. వానకాలం గిట్టయితె యా గుంతలల్ల నిల్సిన నీళ్ళన్న దెచ్చుక తాగుతరు. యా గుంత దంక ఎందుకు,గూడెం అంత బుర్దమగ్గేగదా! అడ పెద్ద గుంత గాక పోతె ఆడ ఇండ్లు యాడుండవి. గని ఇంగ ఎండకాలం సంగతి. అడ్వా దడ్వా పొలాలు ఎండకుండనీళ్ల గట్టె టందుకు మోట్లు గొట్తరు. అప్లాంటప్పుడు నీళ్ల పెద్దరాతికట్నం కాల్వ. దోని, సన్నకాల్వ దాటి రైలుకట్ట ఇవుత ఉన్న శాగర మట్ట పొంటి ఉన్న గుంతకాల్వ దాటి నంక పొలం గెట్ల నడుమ ర్యాగట్లకు నీరువారె కాడ పోతలు, పందులు పొర్లి పోయి నంక అడ్గున మలిసిన నీళ్ల దోసిళ్ళ తోటి తోడి ముంచు కొచ్చుకుంటరు, గూడె ఆనీళ్ల కుండల అడ్గున కప్పపిల్లలు రొయ్యపిల్లలు చిత్తడు చిత్తడుగ చివికి ఒండున పేరుకుంటవి. అంతట్లనె పోరలు సెయ్యి పెట్టి ఆ ఒండు దేపుక తిని ఆ నీళ్ల తాగుతరు. ఇది వాళ్ల బతుకు. అసొంటి గూడెంలకు సా దొచ్చిండు వొచ్చిన ఎవరు పట్టిచ్చుకోలేదు. అక్కె పోయిన సాదు నాల్గు దిక్కులు పారజూసి నల్గుర్ని పిల్సిండు. అందలు జూడంగసొతాగచేతు లోటి ఒతావున గీతగీసి, ఈడ జల ఉండది సెల్మె వత్తదిబాయి వట్టుండి అన్నడు. నల్గురు నాల్గు సేతులేసిన్రు. పని సాగింది. యాపసెట్టు కింద

రొండు పఖ్ఖు బండ లే పిచ్చుకోని కూసుండి బాయి కట్టిచ్చిండు. సూడు సూడు మనుకుంట బాయిల నీళ్లు కొబ్బెరి నీళ్ల తీర్గ తియ్యగ వడ్డవి ఊట సెప్పతరం గాదు. పిల్లా జెల్లా అంత కొరిసీమ లోలె ఎగవడి అంచె బుట్ట ల్తోటి తోడి ఆ మన్ను దీస్కపోయి గూడెం ల గుంతలన్ని పూడ్సు కున్నరు. ఊరి కుమ్మరోళ్లు బాయికి వట్టిన రింగులు గాల్సి యిచ్చిన్రు. వడ్లోడు చౌలు, గిర్కలు జేసి ఇచ్చిండు. కమ్మరోళ్లు ఇనుపబొక్కెన్లు ఇచ్చిన్రు. ఇంగ బాయి సుట్టురా గోడ వెట్టిచ్చి గచ్చు జేపిచ్చిండు. నాల్గు దిక్కులు నాల్గు గిర్కలు, యా పీకులాట లేకుండ చేదు కోవచ్చు. నాల్గో దిక్కున్న గిర్క కాడ పెద్ద గచ్చుగోలెం గట్టిచ్చిండు. బాయి మీదికి వొచ్చి సమ్మ మొదటి కడువ ఈ గోలెంల వోసె టట్లు కట్టడి జేసిండు బాయి పక్కపొంటి కంపవెట్టి భూమి సదును జేసి చెట్లు నాటిచ్చిండు. ఆ చెట్లకు అవుతల పెంట బొంద ఎర్పాటు జేసిండు ఇంతదన్క ఊ రెన్క మడ్గు లల్ల ఐట్లెల జంటకు వడి మున్గి మరింత గౌలు కంపు గొట్టె పోరగాండ్లిప్పుడు గచ్చు గో లెం ల నీళ్లు తానం జేయ వట్టిన్రు. పోర గాండ్లను జూసి తల్లులుగూడ రొండు దినాల కోనాడు పై గడుక్కో వట్టిన్రు. సాదు వొచ్చినంక గూడెంలకు పెద్దా చిన్న వొచ్చుకం పోకడ జరిగింది గూడెంల బాయి నీళ్లు గంగతీర్థమోలె తియ్యగఉండవి. ఆని పెద్దకులస్తుల పిల్లలు గూడ తాగుతుండరు.

సాదుకు నాలుగైదు బాస లొస్తవి. దుర్బిని ఏసి సూడొచ్చు చెండు ఆడొచ్చు, చెట్లు ఎక్కొచ్చు. పోషాకు తీరు జూస్తెనె సా దోలె ఉండడు గని సాదు 'చా' తాగుతడు. అన్నం దింటడు మనోల్నె పాలు పెట్గు తింటడు. నీసు ముట్కు ముట్టడు. సాటుకైనా సేటుకైనా ఒకటే

తిండి. కల్గి నోళ్ళ ఇండ్లల్ల పరుమాన్నం దీస్నల్లె లేని ఇంటికి వొచ్చి పచ్చిపులుసు మెతుకు అంత ఆరివారంగ దింటడు. ఉన్నమాట జెప్పా ల్నంటె సాదులంటె సంటిపోరలకు బయం. దుడ్డెగాళ్లకు ఎడ్డిర్కం గని ఈయన అట్ల గాదు. సంటిసిల్ల లంటె సంతోసం. ఈయన దుడ్డెగాళ్లల్ల దుడ్డెగాడు. సన్నవిల్లల్ల సంటోడు. అట్లని వయసు మళ్ళినోళ్లకు మర్యాద మన్నన, బుగులు, బయం లేదని గాదు. పెద్దల్ల మళ్ల పెద్దనే. ఊళ్లె ఉన్న పిల్లలున్న కూడగట్టి వాళ్లకు తీరొక్క ఆట నేర్పిండు నేర్పినట్లు కండ్ల వడడు, గని సాదు ఆట నేర్పిండు వాళ్లు నేర్సుకున్నరు. ఇన్నాళ్ళు ఊరికెళ్ళి ఇవుతలికి వానకాలం దాట పోంగాక పోయేది గని నిరుడు వొడ్డోళ్ళొచ్చి బండగాల్సి రాయి దీసుకున్నంక మిగిలిన బెందడి అంత ఉక్కుకడ్డి లసొంటి పోరలు మోసుకొచ్చి ఆడ్నుల వోసి బూమిని బురుదల బుంగ కుంట గట్టి వారిచ్చిన్రు. ఇగ ఎంత వొరుద వొచ్చిన గని కయ్యాలు గొట్టుదు బాట, పిల్లబాటకు, బండ్ల బాటకు యా తిప్పలు లేదు. ఇవ్వా డా ఊళ్లె

సాదు ఒగరి ఇంట్ల పండుకోడు ఎంత రాత్రైన గని తన గుడిసె కే వొచ్చి పండుకుంటడు. సాదు గుడిసె ఊరి ముంద లున్న అను మాండ్ల గుడిపక్కల ఉండది. అనుమాండ్ల గుడి, బొడ్రాయి, రాగి, చెట్టు యాపచెట్టు యా తరాల నుండి ఆడ వున్నవో గని ఉన్నవి గుళ్ల అంజనేల కు సిందూరం గూడ గండ్ల వడకుండ అయిందె. వొష్టిమయ్య శనివారం ఆరగింపు జేసి మళ్లా అటు దిక్కు మళ్ళి అన్న సూడకుండె రామచెంద్రయ్య నే దినాం రాత్రికి ఆయిందం దీపం వెడ్తుండె. అసొంటి గుడి సాదు రాంగనె ముద్దుగైంది. గర్బగుడిని గట్టిగ గట్టిన్రు. ఆ వెంక ఓ మండుపం గట్టిన్రు. రాగి యాపచెట్టుకు గల్సి అర్గు ఏసిన్రు.

మఱ్ఱిచెట్టు కింద ఉన్న నాగుల సుట్టు అక్కు పూతలైనవి. కొత్త కంచు గంట వొచ్చింది. వొంటలకు రొండు మూడు దళ్లు గట్టిన్రు. ఊళ్ళ ప్యాద సాదల పెండ్లిళ్లు గుళ్ల జేసుకోని దళ్ళల్ల వొంటలు వార్పులు బోజి నాలు జేయవట్టిన్రు. ఆ ఊరి కుంప గొల్లోళ్ళ పెండ్లిల్లు జేసుకోని గుళ్ళ అరుగుమీద గూసోని ఆకు పోకలు గొర్కి ఇంగ ఆడికెల్లి నాగుల కాడ్కి వొచ్చి తక్కెడిగుండు ఆడి తమాసగ ఇండ్లల్లకు వోయి ఇల్లు నింద వట్టిన్రు.

ఆ ఊళ్ళ ఓసిన్న సాళ్లె ఉండది. వొష్టిమయ్య నే పంతులయ్య. వొష్టిమయ్యకు మొన్న మొన్ననే మోత్కబిందులై కండ్లు పురాగ గండ్ల వడకుండ ఐనవి. మూడో సమందం పెండ్లాం ఆండాళమ్మ పిల్లగాడు గండ్ల వడ్డెసాలు, చెట్టెక్కి నాల్గు కల్యామాకు రెమ్మలు దెంచి య్యి నాయినా అనుకుంట ఇంట్లకు విల్సి ఇంబెడు పని జేపిచ్చి పంతులయ్య సెవు నేసేవు! అని కీసల ఏపుడుబియ్యం బోస్తది. సాళ్లెల సదువుకు గూసున్న పిల్లలల్ల పల్కమీద లెక్కలు రాసిన పిల్లగాణ్ణి జూసి కండ్లు సరిగ్గ గాన్రాక చిత్తారి దించిం డనుకోని ఆరీ నేను లెక్కలు జేయమంటె చిత్తారి దించుతుండావ్! నీ ఈపుల పాపయ్యను దీస్త ఉండు, అని బర్గెవట్టుక దంచుతడు. ఎక్కచ్చె కోదండాలు ఎక్కచ్చి గోడ కుర్సీలు, బింగిళ్ళు, తిగిట్ల దండకాలు గిట్ట ఐనంక జెర జెర కోపం సీదర జల్లారి పాటం జెప్పు ద మని యీసపీట దెర్సి భాగవతం బట్టుకునే వరకు, తల్పుసాటున అండమ్మ నిలవడి, రామచెంద్రుడూ పంతులయ్యను మడిగట్టుకో మను, అని తీగెరాగం దీస్తది. ఆ రాగం ఇని పంతులయ్య పలుకలు గట్టుండి, అని నస్పెంకాయ రొండిన జెక్కొని, ఇంట్లకు నడుస్తడు. ఇసొంటి సాళ్లెల సదువుకం ఏంది అని పోరలు చెట్టుకోడు గుట్టకోడు ఐ తిర్గుతరు. అసొంటి పోరగాళ్ళందర్నీ జమజేసి సాదు సదువుల ఏసిండు.

పెద్దవాగుల కెల్లి ఉస్క దెప్పిచ్చి మండుపముల ఓ దిక్కు వోయించిండు. కుసి కుసి కూలి కూలి అన్నట్లు పోరలు ముద్దుగ నగుకుంట మురుస్కుంట వారిది గట్టిన ఉత్తలోలె మోసింద్రు పల్కలు గానుకోలేని పోరలు గునియ కుండ అందరు గల్సి ఉస్కల్నే ఓనుమాలు, ఒంట్లు ఎక్కాలు దిద్దిన్రు. పాటం అయి నంక ఆ ఉస్కల్నె పిట్ట గూళ్ళుగట్టుకున్నరు. గాజప్ప ఆట ఆడుకున్నరు. బొమ్మరిల్లు గట్టు కున్నరు. చిత్తార్లు దించిన్రు అటెంక చెడిపితె మళ్ళ పల్గోలె అయింది. ఉస్క పిల్ల లంత పొద్దుగాల లేవంగనె సాదు దగ్గెరికి ఉర్కి వొచ్చెటోళ్ళు. అందరు యాపపుల్లేసుకోని పండ్లు దోముకోని కాల్వల మొకం గడుక్కోని వర్సలు గట్టి నిలవడ్తుండిరి. కావలి రామయ్య గజ్జెలకట్టె వట్టుకోని ఓపిల్ల గాడు ముంగల నిలవడి భూమి మీద గల్ల గల్ల గొడ్తుంటె కుర్వడోలు మెడ కేసుకోని ఇంగో పిల్లగాడు డిల్లెం డిల్లెం అంటుంటె ఎన్కకు ముందుకు మీదికి కిందికి వొంగి డిరిల్లు జేస్తుండిరి. అటెంక పోరలు ఇండ్లల్లకు వోయి అంబలో, సంకటో, రొట్టో, మెతుకో, కూరబువ్వనో దిని తలిదండ్రికి యా దన్న పనిపాట ఇనెటోళ్లు. మళ్ళ మూడుజాము లప్పుడు గుడి కాడికి వొచ్చి ఆడ నాటిన అరటి చెట్లకు. దేవగన్నేరు పచ్చగన్నేరు, రెక్కగన్నేరు చెట్లకు నీళ్లువోసి గొలేసి పల్కిన గొలలు, గోసి తట్టుసంచులల్ల జుట్టి గుడ్సెల దా పెట్టుండిరి.

ఎవ్వరు జెప్పకుండ సేయకుండ, ఊళ్ల మొగపిల్లలు ఇంత ముద్దుగ వెర్గుతుంటే ఆడిపోరగాండ్లకు తల్లులు నెత్తంటి, ఈర్పెనపెట్టి దువ్వి, పేను ఈపి దీసి, జడలేసి, ముక్కల నూనె వొట్టేస స్యాపను రాకి నట్లు రాకి జళ జళ జేసె ట్యాళ్లకు ఆడివిల్ల లంత లంగ ఉన్నోళ్లు లంగలు,

లే నోళ్ళ అన్నల నైకర్లు, అవీ లేనోళ్ళ అయ్యల పాత పంచె, అవీ లేనోళ్ళ తట్టుసంచి కైగ వాగుల ఉతుక్కోని మొలకు జుట్టుకోని గుని గున మంట సాదుకాడిక్కి ఉరుక్కుంట వొచ్చి సామి! ఓ సామి! మేం ముద్దుగ తానాలు జేసినం, మా అవ్వ రాగెడిబుర్ర వెట్టి గోళ్ళగొట్టి నెత్తికి వోసింది. వీరి నెత్తి పిస్క వాసన గొత్తలేదు. ఈరి నెత్తిన ఈపి అంత వోయింది. గంగి ముక్కు గార్తలేదు వాళ్ళ అవ్వ నూనెసుక్కే సింది. కట్టీ గొంగడి బొంత కైగ ఉత్కుక్కోని సుట్టుకొచ్చు కున్నది. రామి పైగడు కున్నది. నాగి తప్పలకు ఆయిందం ఒట్టి ఎల్లి పాయె సిగె బిగిచ్చింది. రాజి వాళ్ళ అవ్వ పెద్ద సీరగట్టుకొచ్చింది. సామి! గని పిరిసుట్టు బిగిస్తె పొట్ట నొచ్చె నని ఒత్తితె వాళ్ళమ్మ సాపుగ జెక్కింది. అదికాళ్ళల్ల దట్టుకోని సీర ఊసిపోయింది. అందుకే అది మళ ఉర్కింది ఇంటికి. మేమందరం ఉస్కమోస్తం, సెట్లకు నీళ్ళు వోస్తం, ఇల్లు అల్కుతం, వాకిలి జల్తం, సెమ్మెలు దోముతం, సింతపల కాయలు దెస్తం, గట్టుకువోయి యిష్ణుతుల్సి దెస్తం, అంజనేల ముంగల పబ్బతివడ్తం, ముక్కు మీద ఏలేసోక్కని గూసుంటం. సదువుతం అన్నరు.

ఈ మాటలు ఇంటున్న ఆ పిల్లలను జూసి సాదుకు కండ్లు మణుసు రొండు నిండినవి. ఇంతట్లనె రాజి సీరఇడ్సి పారేసి ఉత్త బత్తల ఉర్కి వొచ్చింది దాన్ని అమాతం అందుకోని సాదు తల్లీ! నీవూ సదువుకుంటావే నా బంగారు అని లోపలికి వోయి ఓ పాత బట్ట దెచ్చి తనకు వొచ్చినట్లు దానిసుట్టు నాల్గుసుట్లు ఐదేండ్లగుడ్డుజుట్టిండు గుడ్డ సుట్టుకున్నంక దానికి సిగ్గొచ్చిం దేమె కండ్లు మూసుకోని సాదును అలుముకున్నది

సాదు యీపుటవురి పిల్లను కిందికి ఓంపి అప్లే సదువుకోండి అన్నడు. ఇప్పుడు ఆడివిల్లలు మొగపిల్లలు గల్సి ఒక్కతీరు సదువుతుండరు. సదువు గిదువు గాదు గని, ఊళ్లె అందరు కులస్తులు గల్సి ఒక్క కాడ కల్సికూసుం టండ రని పెద్దింటోళ్ళందరు ముర్సిపోయింగ్రు. దినాం సాదున్న దిక్కుకు దిర్గి దండం బెట్టుకుంటరు.

మొన్న బజ్జె సిద్దప్ప బిడ్డ రాచమ్మ పదారేండ్ల పిల్ల దయ్యెంబట్టి గాజుల ప్యాట్ల కెల్లి వొచ్చిన మంత్రగాణికే మంతరిచ్చు కుంట హూం అంటె హాం అనుకుంట జుట్టువట్టుకోని ఊగి, వొచ్చిన బాట వట్టె టట్లు జేసి, రయిఁ మనుకుంట లేసి సెరిసగం రాత్రికి సింతకిందికి జేరిం దంట; సా దొచ్చిఏం జేసిందో ఏమొ ? దయ్యెం గియ్యం అన్ని వొదిల్నవి. ఇంగ తలిదండ్రి సాదుకాళ్ళ మీద వడి సింతెక్కి కూసుంటున్న బత్తీసల ఈరప్ప కొడుక్కు శంకరప్ప తోటి సంబంధం గట్టి జేయమన్నరు. సాదు సల్వతోటె శంకరప్ప రాచిమ్మ ఆలు మొగలైగ్రు. ఇద్దరు గల్సి సాదుకు సాగిలపడి దండంబెట్టిగ్రు.

ఇట్ల సాదు జే స్తున్న పనులు ఒకటా ? అరనా ? నిజంగ సాదు ఎవరూ ? ఏంది? అని శనా మంది, సాదు లోతుదెల్సుకుంద మనుకున్నరు. ఒకొక్కొక్క మెట్టు సాదు మంచిదిక్కు ఎక్కుకుంట వోతుంటె. ఆవూళ్ళ ఉన్న మిటారికత్తెలు సాదును నర్కలోకిం దిక్కు గుంజాలె ఆని కన్నమ్మ కష్టం పడ వట్టిగ్రు ఎంత తిప్పలువడ్తె ఏం లాబం సాదు సాదే. ఇంగ ఈతకు వొయ్యెటప్పుడు, గుడ్సెల తడ్కవోరగ ఏసుకోని ఒంటిగ గూ సున్నప్పుడు, బాయికి వోను పడక, గూడెం బాయి మీద, తానం జేసె టప్పుడు. చెం డాడె టప్పుడు. ఆరకంట్లం? ఇడ్సి ఎద తుడ్సుకొనె టప్పుడు, ఎవరో

ఆడిపొల్వెర సాదునుజూసినట్లని పిచ్చేది. అ సూపు ఉత్తుత్త సూపుగాదు. చాప నేసె గాలం అసొంటిది. దిష్టి గొట్టె పాపిష్టి కన్నసొంటిది. దొర్కితె సాలు నముల్క తిందా మన్నంత ఎంగిలిసూపు అది. గని సాదు సూసి గూడ సూడ నట్టె పోతడు. ఆడ నీడ ఉన్నట్లు గూడ అనుకోడు. సీదరిచ్చు కోడు. యావగించు కోడు. హర అనడు. శివ అనడు. ఉల్కడూ పల్కడూ. తా నేందో తన ప నేందో అంతే. అందు కని పూసిన సంపంగి చెట్టు తుమ్మెదలకు పనికి రా నట్లు ఆ వూరి బసివి కత్తెలకు మిటారి కత్తెలకు సాదు పొలుపు పనికి రా లేదు. పనికి రా లేదని గాదు. రానియ్యలేదు సాదు. రానియ్యడు గుడ. ఇంగ మంచినీళ్ళ బాయికాడ. బట్టలుతెక్క సెర్వుకాడ. కలుపుకోతల కాడ. తునికి ఆకు ఏరేకాడ. మిర్పతోట దులిపే కాడ. ఎడవిల్లలు పుంగిళ్ళు పూసేకాడ ఆడివాపలు సిన్నదొరుసాంన్లకు నెత్తులు దువ్వేటప్పుడు. తిలుకాలు దీర్సెటప్పుడు. మొగిలిపువ్వ జెడలల్లేటప్పుడు. అద్దాల రయికెలకు జరి దిప్పేటప్పుడు సాదు మాటొస్తది.

అపునమ్మా సాదు రూపును ఓసారి జూడు రొండు కండ్లు జాలవు అంటది. ఆడివాప ఎంకటి. ఎంకటి! మొన్న మా ఇంటికి వొచ్చినప్పుడు బంగ్ల మీదికెల్లి జూసిన అయిన రూపుకు వొం కేముందే వొంక మనదేగని మాహానుభావుడు అంటది ఒక పెండ్లిగాని పడుచు ఇంకోకాడ అమ్మో సాదు అచ్చం అంజనే లసొంటి నిష్ఠ పరుడు నిప్పుకు యా డ్నన్న సెద లంటు తయా? పుల్లక్క నీ కత గాకపోతె? ఏ హే అట్ల గాదె; నెక్కె క్కడ నాగ లోకమెక్కడ? మన మొకం అద్దంల జూసు కో కుండ. ఎదుటి సంపదామకు ఎగపడ్తె అందుతుడా? చెందుతడా? అంట అని

ఇంకో అమ్మ అంటె. ఆడ్నే ఉన్న ఎడ్డిబాగుల తల్లి ఒగామె 'అవునంటనే అక్క! ఓనమాలి జెప్ప వట్టింది. ఆ సాదు రామచెంద్రమూర్తి తీర్గ కుఱుకులాపి తళుక్కు బెళుక్కులకు, శాలాకి షాష్టలకు సెక్కు సెదిరె టోడు గాడని, అంటె. ఆ మాటిన్న పచ్చిగడ్డ్యమిత్త రంగి "ఆఁ ఒల్లడు బెల్లంబువ్వ పాపం సాదు నాల్గు సదువులు సదివి పెద్దసబేల్ తోటి సెబాస్ అనిపిచ్చుకోని నల్గుట్ల పేరువోయి నోడు అలికిడి కే ఉలికే అన్నట్లు తానై తాను బైటపడ్డె నలుగుట్ల నగువాటని జెర బెట్టు నిలవెట్టు కున్నట్లు న్నది; గని లేకుంటె ఉప్పుకారం దాకిన పై గదా ? కోడెపాయానుండె గదా. ఇసొంటి సిత్రం యాడనన్న ఇన్నమా? కన్నమా ?" అని అంటె. మళ్లో పిల్లతల్లి "అయ్యో ! సాదు సంగతి నీకింగ బాగ దెల్సి నట్లు లే దే అమ్మ! మనూరి నూత సక్కని బొమ్మ లంత మస్తుగ తంటాలు వడ్డరంట గని ఆ తండ్రి ఉల్కలేదంట పల్కలేదంట. ఆ తండ్రి నిగ్గం ల ఆవగింజంత గూడ అటు ఇటు గా లేదంట" అని చెప్తే' ఆ మాట ఇని, 'బాలా ! నీవెంత తిక్కసన్నాసివే. ఎండకన్నెరుగనసొంటి మనూరి బరింగా బొమ్మలు వారగంట ఓసారి జూస్తె మొగులు మీదికెల్లి మోదుగుపువ్వదొర దిగివొచ్చే టట్టుండరు గద. ఇంగ అసొంటోళ్ళు వాళ్ళంతకు వాళ్ళే వొచ్చి సాదు కండ్లల్ల వడ్తె వొల్లనని కట్ట్యాలె కర్సుకవోయిం డంటె నమ్ముతమా ? ఇంత కా సాదు మొగోడా? మానా?" అని అన్నది. ఈ మాట లన్ని ఇంటున్న ఇందిరమ్మ రామచంద్రయ్య వొదినె "ఏం మాట లవి? చిన్నా పెద్ద లేకుండ? రంఢీ!. నీవు సిగ్గూ సెరము పురాగ సిట్టెదు గుగ్గిళ్ల కమ్మి నట్లుండవు. నీవెంత ? నీ తీర్పారితనం ఎంతనే ? ఇ టిటు రమ్మంటె ఇల్లంత నాదే నన్నట్లు. దేవుణి అసొంటి సాదు మీద ఆడి పోసుకుంటావ్? నీకు దెల్సిందల్ల నీ బుద్ధి. నీవు దినాం జూసే ఈ ఊరి దొరల బుద్ధి. ఇగ ఆ కొత్తలత్తోటి గొల్సి సాదు అసొంటోడు.

ఇసొంటోయ్డు అసకు. ఉత్తపున్యానికి పాపం ఎందుకు వాడిగట్టుకుంటవే? మనం. మన ఊరు నోమిననోము నడ్సుకుంట వొచ్చి నట్లు సాదు వొచ్చి ఈడ నిల్సిండు!" అని అన్నది. ఆ మాట లిని అందరు కు యిక్కమన కుండ ఉన్నరు. ఇట్ల సాదు ఆడోళ్ళనోట్ల్ల ఓనాం మెదుల్తడు.

రామచెంద్రయ్య కన్న తండ్రి కే ఎక్కువ గురి సాదంటె "చెంద్రా సాదుకు జెర పై ఎచ్చజేసినట్లుండది. కషాయం బెట్టిచ్చు." అని, 'ఈ యాళ్ల పుల్లావ్ ఈనింది. జున్నుపాలు పిండి జున్నుజేసి సాదుకు పంపుండి.' అని, 'కంకులు ల్యాతగ మొగ్గలోలె ఉండవి రొండు గాల్చి సాదును పిలువుండి' అని' "మొక్కగారెలు జేసి ఎన్న పూస రాసి సాదుకు పంపుండి" అని, అంటడు. పంపిన వాటిలల్ల సాదు పెద్దమనిషి తృప్తికొలుకు రొండు దని మిగిల్నవి సంటిది రాజికి ఇస్తడు. ఒగొగనారి రామచెంద్రయ్య తండ్రి ఏందో ఆలోచన జేసి చేసి కొడ్కను జూసి "చెంద్రం సాదు నిజంగ అవుతార పురుషుడో? ఏందో! ఎక్కడ అంతువట్ట లేదు. సాదును జూసినప్పుడల్ల శాంతమ్మ నా మనసుల మెదుల్తది" అన్నడు.

శాంత రామచెంద్రయ్య చిన్నచెల్లె. మెరుపుతీగ అసొంటి పిల్ల. ఆ పిల్ల పెద్దసదువు కని పట్నం బోయింది. రొండో ఏట సన్నిపాతకం జెరం వొచ్చి కన్నుమూసింది. శాంత కన్నుమూసి మురారి బత్కు సీకటి జేసింది. పెండ్లి గాక వోయినా మురారి శాంత ఆలు మొగలైరు. శాంత వోయినంక అంగలార్సి. తండ్లాడి, తన్నుకొని మంచాన వడి, శాంత ఎంట వో లేక సన్నాసి ఐండు మురారి, ఆపిల్ల పుట్టిన ఊరికి వొచ్చిండు. మురారి ఇప్పుడు అందరి మనిషి ఐండు. మురారి మందికోసం బత్కు తుండడు మురారి. శాంత పిల్సేవరకు వోపికతోటి పుట్టెడు దుక్కం దిగమింగి నిల్సిండు మురారి.